జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 22 | జూన్ | 2025 ◆ పేజీలు : 6

## ఐటిడిఎ లో ఘనంగా
# అంతర్జాతీయ యోగా దినోత్సవం



**భద్రాచలం, జూన్ 21(ప్రజాజ్యోతి ):** భద్రాచలం ఐటీడీఏ ఆవరణలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ యోగాలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో రాహుల్, ఐటీడీఏ అధికారులు పాల్గొని యోగా చేశారు. యోగాతో మానసిక ప్రశాంతత, శారీరిక రుగ్మతలు మాయమవుతాయని, మనస్సు

మిగతా 2 లో...

- అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చిన తర్వాతనే ఓట్లు అడగటానికి వస్తా...
- గత ప్రభుత్వం బొమ్మ ఇల్లు చూపించి మాయమాటలు చెప్పి రెండుసార్లు అధికారంలోనికి వచ్చింది..
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత బోధన మరియు బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తాం..
- పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న వారిని అధికారులు ఇబ్బందులకు గురి చేయొద్దు...
- పినపాక నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 225 కోట్లు..
- 110 కోట్ల రూపాయలతో ఆళ్లపల్లి నుండి అని శెట్టిపల్లి రహదారుల నిర్మాణం..
- పినపాక నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

## సంక్షేమం, అభివృద్ధి
# ప్రభుత్వ ధ్యేయం

**గుండాల, జూన్ 21, ప్రజాజ్యోతి:** అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చిన తర్వాతనే మళ్లీ ఓట్లు అడగటానికి ప్రజల వద్దకు వస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం పినపాక నియోజకవర్గం పర్యటనలో భాగంగా ఆళ్లపల్లి మరియు గుండాల మండలాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మరియు ఐటిడిఏ పిఓ రాహుల్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా గుండాల మండలం జగ్గు తండా గ్రామం నుండి లక్ష్మీదేవి పల్లి వరకు రెండు కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆళ్లపల్లి మండలం ఆళ్లపల్లిలో నూతనంగా మూడు కోట్ల 35 లక్షల రూపాయలతో నిర్మించిన కస్తూరిబా గిరిజన బాలికల పాఠశాల మరియు వసతి గృహం మరియు 82 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడను మంత్రి ప్రారంభించారు. అనంతరం

మిగతా 2 లో...




## వాహన తనిఖీల్లో
# గంజాయి పట్టివేత



**భద్రాచలం, జూన్ 21,ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలో ఆర్టీఏ కార్యాలయం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్

మిగతా 2 లో...

- అట్టడుగు స్థాయికి అభివృద్ధి ఫలాలు చేరుతున్నాయి
- సంక్షేమాన్ని సరైన రీతిలో అందిస్తున్నాం ... ఎమ్మెల్యే జారే
- మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ

## ఇందిరమ్మ రాజ్యంలో...
# ఇంటింటా సంతోషమే

**అశ్వారావుపేట, జూన్ 21, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో కొలువుతీరిన ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంతోషమేనని, అట్టడుగు స్థాయికి అభివృద్ధి ఫలాలను చేరవేస్తూ, సంక్షేమాన్ని ప్రతి ఒక్కరికి సరైన రీతిలో అందిస్తున్నామని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని జమ్మిగూడెం, మద్దికొండ, అచ్యుతాపురం,

మిగతా 2 లో...



## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంతోషమే





(మొదటి పేజీ తరువాయి...)

కొత్త నారం వారి గూడెం, నారంవారిగూడెం అశ్వారావుపేట మున్సిపాలిటీ వేదాంతపురం ,దిబ్బగూడెం, నారాయణపురం, తదితర గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ గత ప్రభుత్వ నిర్వాకం వలన నేడు అప్పులు కుప్పగా మారిందని, అయినప్పటికీ అనేక కష్టన ష్టాలకోర్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పదంలో నిలుపేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారుల సహకారం కూడా ముఖ్యమని ప్రజలకు కావలసిన అవసరాలను గుర్తించి వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని, వారికి అందుబాటులో ఉంటూ వారి ఆశలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గృహజ్యోతి ద్వారా 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు రూ.2 లక్షల రైతు రుణమాఫీ ఎకరానికి 12 వేల పెట్టుబడి సాయం రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను బడుగు, బలహీన వర్గాల కోసం చేపట్టిందన్నారు. ముందుగా ఆయన మున్సిపాలిటీ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలించి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. నిర్మాణ పనుల నాణ్యత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించిన ఆయన త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పంచాయతీరాజ్ డిఇ శ్రీధర్, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ సలీమ్ , పంచాయతీరాజ్ ఏఈఅక్షిత, నియోజకవర్గ నాయకులు జూపల్లి రమేష్ మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు, జూపల్లి ప్రమోద్ జాష్ట సత్యనారాయణ చౌదరి, బండారు శ్రీనివాసరావు, మిండా హరిబాబు, దండాబత్తుల రమేష్ ,పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీల్లో గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో 10.150 కిలోల ఎండుగంజాయి లభ్యమైందని, ద్విచక్రవాహనంపై సిద్ధిపేట జిల్లా తునికి బొల్లారం పట్టణానికి చెందిన బండి ప్రణీత్, గోదావరి ఖనికి చెందిన ఐలాపురం రఘుపతిలో ఒరిస్సాలో మల్కానగిరికి బైక్మీద వెళ్లి గంజాయి కొనుగోలు చేసి భద్రాచలం మీదుగా హైదరాబాద్కు తరలిస్తూ పట్టుబడ్డారు. నిందితుల వద్ద రెండు సెల్ఫోన్లు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయి రవాణా చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 18004252523కి సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో సిబ్బంది బాలు, సుధీర్, హరీష్, హనుమంతరావు, విజయ్కుమార్, వెంకట్లు పాల్గొన్నారు.

## ఐటిడిఎ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ యోగా చేయాలని, ప్రస్తుత జీవనం సాఫీగా సాగాలంటే యోగాతో సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి...)

ఆళ్లపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులైన బత్తిని శ్రీలత w/o శ్రీధర్ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల 227 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుండాల మండలం మామ కన్ను గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 20 లక్షల నిర్మాణ వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. గుండాల మండలం లింగగూడెం గ్రామం లో చీమల గూడెం ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఇప్పల గుంపు వరకు కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుండాల మండలంలో చిన్న ముత్తయ్య s/o మల్లయ్య ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి గుండాల మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 16 మందికి మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ పర్యటనలో మంత్రి మాట్లాడుతూ..గత ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందని, పేద తల్లిదండ్రులకు వారి పిల్లలను చదివించాలని కోరిక ఉన్నప్పటికీ చదివించుకోలేని దుస్థితి గత ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత అత్యాధునిక సదుపాయాలతో పేదవాడి పిల్లల భవిష్యత్తు ఆశయాలు నెరవేర్చే విధంగా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని మంత్రి అన్నారు. బోధన మరియు బోధనేతర సిబ్బంది తక్కువ వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని తమ దృష్టికి వచ్చింది అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత కచ్చితంగా వారి యొక్క సమస్యలను నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. గత సంవత్సరంలో పదవ తరగతి లో 100% ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేసిన ఆళ్లపల్లి కస్తూరి బా గిరిజన వసతి గృహ పాఠశాల సిబ్బందిని మంత్రి అభినందించారు. సిబ్బందికి కావలసిన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం చూసుకుంటుందని, పేద విద్యార్థులు వారి భవిష్యత్ ఆశయాలను సాధించే విధంగా విద్య నేర్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించవలసిందిగా అధికారులను ఆదేశించారు.

ఇందిరమ్మ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి మరియు మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం పేదోడి కష్టాలను పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పరుస్తూనే, గత ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూ, ఈ ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమానికి 200 యూనిట్ల ఉచిత





విద్యుత్, 500 కే గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదవారికి మెరుగైన వైద్య సహాయం కోసం 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు, పేద విద్యార్థుల సంక్షేమానికి 40 శాతం మిస్ చార్జీల పెంపు మరియు విద్యార్థుల కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచింది ఈ ఇందిరమ్మ ప్రభుత్వమే అని మంత్రి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఈ రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర చెల్లిస్తూనే సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ ఇచ్చిన ఘనత ఈ ఇందిరమ్మ ప్రభుత్వానిది అని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో 17 వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే ఈ ఇందిరమ్మ ప్రభుత్వం కేవలం 10 నెలల్లో 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందన్నారు. రైతుబంధు ద్వారా గత ప్రభుత్వం ఎకరానికి రెండు పంటలకు పదివేల రూపాయలు ఇస్తే ఈ ప్రభుత్వం 12000 రైతు భరోసా ఇస్తుందని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో బొమ్మ ఇళ్లను చూపించి ప్రజలకు మాయమాటలు చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చిందని, పేదల సొంతింటి కలను నెరవేర్చే విధంగా ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇండ్లకు ప్రతి ఇంటికి ఐదు లక్షల రూపాయల చొప్పున ఇస్తుందన్నారు. పినపాక నియోజకవర్గం లో 4,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా వాటికై 225 కోట్ల రూపాయలను కేటాయించామన్నారు. ఇంకా మూడు విడతల్లో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, చేసిన తర్వాతనే ఓట్లు అడగటానికి వస్తామన్నారు. ఆడబిడ్డ లేదా ఏ పేదవాడు ఇల్లు రాలేదని అసంతృప్తి చందనవసరం లేదని అర్హులైన ప్రతి పేదవాడికి విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఇది ఆరంభం మాత్రమే అని మంత్రి తెలిపారు.

పినపాక నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా ఆళ్లపల్లి నుండి అనిశెట్టిపల్లి వరకు 36 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి 110 కోట్ల నిర్మాణ వ్యయంతో వచ్చే నెలలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. రేగళ్ల నుండి మర్కోడు డబుల్ రోడ్డు నిర్మాణం మరియు ఆళ్ల పల్లి మండలం నుండి కొత్త వెంకటాపురం త్రీఫేస్ కరెంటు లైన్ లో మంజూరు చేపడతామన్నారు. ఆళ్లపల్లి కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తులు వచ్చినందున అధికారులు ఈ ప్రాంతంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారో చూసి 100 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే వెంటనే కాలేజీ స్థాపనకు చర్యలు చేపట్టవలసిందిగా కలెక్టర్ ను ఆదేశించారు. గిరిజన ప్రాంతంలో తరతరాల నుండి పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులు మరియు గిరిజనేతరులను అటవీ శాఖ అధికారులు మరియు ఇతర అధికారులు ఇబ్బంది పెట్టవద్దని మంత్రి ఆదేశించారు. పేదల కష్టం తీర్చడానికి ఏర్పడిన ఈ ప్రభుత్వంలో ఎంతో కాలం నుండి సాగు చేస్తున్న వారికి ఇటువంటి ఇబ్బందులు కలగా చేయవద్దని ఏదైనా సమస్యలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తారని మంత్రి తెలియజేశారు.



# రాజపురం గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం...

- **జూన్ 23 నుండి 30 వరకు ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం**



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 21,ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలకేంద్రంలో గల రాజపురంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడం జరిగినది. వర్షాలు పడుతున్నాయి కనుక ఇంటిలోపల వాడని తొట్లలో, పగిలిన గిన్నెలో,కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నీరు నిల్వ లేకుండా తొలగించుకోవాలని , మన ఇంటి పరిసరాల శుభ్రత కుటుంబ ఆరోగ్యానికి మూలమని డాక్టర్ ప్రియాంక తెలిపారు. జ్వరం కేసులకు అవసరమైన అన్ని రకాల రక్త పరీక్షలు ఆరోగ్య కేంద్రంలోని అందుబాటులో ఉన్నాయి అని అందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు. ఎర్రగుంట ఆరోగ్య కేంద్రం నందు గర్భిణీ స్త్రీలకు ఉచిత పరీక్షలు చేసి, సాధారణ కాన్పులు చేస్తారని, ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం అలాగే ప్రతి గురువారం అమ్మ కోసం ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళలు అందరు రొమ్ము కాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు ప్రాథమిక పరీక్షలు కొరకు PHC ఎర్రగుంట వచ్చి చేయించుకోవాలని తెలియజేశారు. మధుమేహం, రక్తపోటు మందులు వాడేవారు ప్రతి నెల క్రమం తప్పకుండా ఆరోగ్య పరిక్షలు చేయించుకోవాలని అలాగే మందులు క్రమం తప్పకుండా వాడుకోవాలని తెలియజేశారు. ప్రతి బుధవారం ,శనివారం ప్రతి గ్రామంలో పిల్లలకు గర్భిణీ స్త్రీలకు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం జరుగుతున్నందున అర్హులు తప్పకుండా వ్యాక్సిన్ చేయించుకోగలరు. ఈనెల 23 నుండి 30 తేదీ వరకు ప్రత్యేక వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించటానికి ప్రణాళిక తయారు చెయ్యడం జరిగినది .5 ఏళ్ల లోపు పిల్లల విరోచనల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలి అని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ లను అంగన్వాడీకేంద్రం లలో, పాఠశాలలో జింక్ & ఓ ఆర్ ఎస్ కార్నర్ ఏర్పాటు చేయించడం జరిగినది అని తెలియజేశారు.డాక్టర్ ప్రియాంక, హెచ్ ఎస్ ప్రకాశ రావు, ఆరోగ్య కార్యకర్త పుష్పరాజ్యం,హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు,ఆశా కార్యక ర్తలు ఉమ, వెంకటనరస,స్వరూప పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడి నీ అరికట్టి చర్యలు తీసుకోవాలి

- **ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్21, ప్రజా జ్యోతి:** ప్రవేట్ విద్యా సంస్థలలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు, శనివారంస్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో అజిత్ మాట్లాడుతూప్రస్తుతం రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మలుచుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను భారీగా ఆర్థికంగా మోసం చేస్తున్న దారుణ పరిస్థితి కొనసాగుతుందని, నిబంధనలు ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను లెక్కచేయకుండా ఫీజులు, బస్ ఛార్జీలు, ఇతర ఖర్చుల పేరుతో అమితంగా వసూలు చేస్తున్నారన్నారు, అదేవిధంగా పాఠ్యపుస్తకాల విషయంలో,ప్రభుత్వ నియమాలను ఉల్లంఘించి,ప్రైవేట్ పబ్లిషర్ల పుస్తకాలను తప్పనిసరిగా కొనాలనే ఒత్తిడి పెడుతున్నారని, మార్కెట్‌లో రూ.200కే దొరికే పుస్తకాన్ని రూ.600కి అమ్మే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు, కొందరు పాఠశాలలు తమకే అనుకూలంగా ముద్రించిన నోట్స్, వర్క్‌బుక్స్ పేరుతో కొన్ని వేల రూపాయల మేర డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈ విధమైన దోపిడిపై ప్రభుత్వం తక్షణంగా చర్యలు తీసుకోవాలి. జిల్లా విద్యాధికారి డి ఈ ఓ మండల విద్యాధికారి ఎంఈఓ లు ప్రతి పాఠశాలపై సమీక్ష జరిపి, ఫీజుల వివరాలు, పుస్తక వితరణ వివరాలను సేకరించాలని, విద్యార్థుల భవిష్యత్‌ను డబ్బు కోసం పణంగా పెట్టే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు , కార్యక్రమంలో నాయకులు రాజ్ కమల్ ,అజయ్ శృతి కళ్యాణి ,స్పందన తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం



**భద్రాచలం టౌన్, జూన్ 21(ప్రజాజ్యోతి):** ఒత్తిడిని జయించడానికి, సానుకూల దృక్పథాన్ని కొనసాగించడానికి యోగా ఒక సాధనంగా ఉపయోగపడుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొగ్గ నారాయణ సూచించారు. శనివారం ఉదయం భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలోని కెసిఆర్ కాలనీ వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న నర్సరీలో ఉపాధి హామీ కూలీలతో యోగా చేయించడం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, సమతలమైన జీవితాన్ని గడపడానికి యోగాను జీవితం లో భాగస్వామ్యం చేసుకొని ప్రతిరోజు కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సిహెచ్ అపర్ణ, ఏ పియం జగదీష్, సహాయకులు ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

## 212సిఆర్పిఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో యోగ డే

**భద్రాచలం టౌన్, జూన్ 21(ప్రజాజ్యోతి):** అంతర్జాతీయ 11వ యోగ దినోత్సవం పురస్కరించుకొని సీఆర్పీఎఫ్ 212 బెటాలియన్ ఆధ్వర్యంలో ఘనంగా యోగా డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువతి యువకులతో పాటు సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ దీపక్ కుమార్ మాట్లాడుతూ భారతీయ ప్రాచీన సంపద యోగాసనమని అన్నారు. మానసిక ఒత్తిడి జయించటం తో పాటు శారీరక బలాన్ని కూడా యోగా అందిస్తుందని అన్నారు. యోగా ద్వారా మనల్ని మనం నియంత్రించుకోవడంతో పాటు మన చుట్టూ ఉన్న సమాజానికి ఏ విధంగా ఉపయోగపడతామో అధ్యయనం చేసుకోవచ్చని స్పష్టం చేశారు. యోగ యొక్క ప్రాధాన్యతను గుర్తించి ప్రపంచ దేశాలే యోగాన్ని గుర్తించాయని విద్యార్థి దశ నుండి వృద్ధాప్యం వరకు ప్రతి ఒక్కరు యోగాసనాలు వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సిబ్బంది స్థానిక పౌరులు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా ఆచార్య జయశంకర్ వర్థంతి వేడుకలు

- **ఉద్యమకారుల ఆధ్వర్యంలో లో ఘన నివాళులు**



**పాల్వంచ(రూరల్),జూన్ 21,ప్రజా జ్యోతి :** తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ 14 వ వర్ధంతి వేడుకలు పాల్వంచ పట్టణ బుడగం నాగేశ్వరరావు క్యాంప్ ఆఫీస్ నందు శనివారం ఘనంగా నిర్వహించారు.ఉద్యమకారుడు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి వేడుకలకు సీనియర్ ఉద్యమకారుడు బరగడి దేవదానం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత,ప్రముఖ విద్యావేత్త ఆచార్యులు జయశంకర్ జీవితం అంతా ప్రత్యేక తెలంగాణా కోసం హ్యూహ రచన చేసి తెలంగాణా సిద్ధించుటలో ఆయన లేని పాత్రను ఊహించుకోలేమని కొనియాడారు.గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన ఉద్యమకారుల స్థితిగతులను వివరించారు.ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో లో ప్రకటించిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేసారు.జయశంకర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి ప్రొఫెసర్ గా ఎదిగారని,నేటి తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విధంగా ప్రోత్సహించాలని కోరారు.ముందుగా జయశంకర్ చిత్రపటానికి పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు యస్.డీ.టీ హుస్సేన్, శనగ రామచందర్ రావు,అంతోటి నాగభూషణం,షేక్ తాజుద్దీన్,మోరు వెంకన్న, అజీజ్,శనగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రొంపేడు ఆశ్రమ పాఠశాలలో యోగా దినోత్సవం



**ఇల్లందు, జూన్ 21, ప్రజాజ్యోతి:** మండలంలోని రొంపేడు ఆశ్రమ బాలికల పాఠశాలలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ గడిపల్లి విజయ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మాట్లాడుతూ యోగా సాధన వల్ల శారీరక దృఢత్వం పెంపొందడంతో పాటు మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల అనేక వ్యాధు లను దూరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. యోగా అనేది కేవలం వ్యాయామం కాదని, అది ఒక జీవన విధానమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, యోగా శిక్షకుడు రమేష్, ఫార్మసిస్ట్ శ్రీనివాస్ రావు, విజయ లక్ష్మి , పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాం





**భద్రాచలం టౌన్, జూన్ 21 ( ప్రజాజ్యోతి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ గ్రౌండ్ నందు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ పి ఓ ఆద్వర్యంలో యోగా తరగతు లు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కెసిఆర్ కాలనీ లో గల ఏ హెచ్ ఎస్ బాలుల పాఠశాల వార్డెన్ గుగులోత్ మోహన్ ఆధ్వర్యంలో పాఠశా ల విద్యార్థులు యోగా శిక్షణ తరగతులో పాల్గొన్నారు.ఈ సందర్భం గా వార్డెన్ మోహన్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటూ ఆనందమైన జీవితానికి యోగా ఉపయోగపడుతుందని,వేల సంవత్సరాల నుండి యోగా భారత దేశ సంస్కృతిలో బాగంగా ఉండడం మనకు దక్కిన గొప్ప గౌరవం అని,ప్రపంచ దేశాలు యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రత్యేక గుర్తింపును ఇచ్చాయని అన్నారు. చేసే పనిపై శ్రద్ధ పెరుగుటకు,మానసిక ప్రశాంత కొరకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉండే వారికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని,ప్రతి ఒక్కరూ యోగాను నిజ జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని అన్నారు.చిన్న పిల్లలకు డబ్బును కాకుం డా యోగాను అందిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు.ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు,ధ్యానం,శ్వాస పైన ధ్యాస,సూర్య నమస్కారాలు, ప్రాణాయామము తదితర ఆసనాలపై వాటి వలన కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన అధికారుల అందరికి అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కెటిపిసి లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ



**టేకులపల్లి,జూన్ 21,ప్రజాజ్యోతి:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం కోయగూడెం ఉపరితల గనిలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గని మేనేజర్ శ్రీనివాస్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీరాన్ని బుద్ధితో బుద్ధిని మనసుతో మనసును ఆత్మతో ఆత్మను పరమాత్మతో ఐక్యం చేయడమే యోగ పరమార్ధం అని ఆధ్యాత్మిక శక్తి ఆలంబనగా శరీరక మానసిక ఆరోగ్యాల కోసం సాగించే సాధన క్రమం యోగ ఇంద్రియాలన్నీ వశపరచుకొని చిత్తాన్ని భగవత్ చైతన్యంతో అనుసంధానం చేయడం ద్వారా ఏకాగ్రత సాధించి పరతత్వ సానిద్యాన్ని పొంది తను అంతరంగంలోనే సాధకుడు సమస్త విశ్వాసాన్ని దర్శిస్తాడని ఆశ ధర్మం చెబుతుందని యోగ సాధనలో శ్రీయ సామర్థ్యం పెరుగుతుందని శరీర ఆకృతుని మెరుగుపరుస్తుందని బరువు తగ్గడానికి గుండె బలోపేతం కావడానికి ఆత్మవిశ్వాసం పెరగడానికి దోహద పడుతుందని రోజుకు కనీసం 30 నిమిషాల పాటు యోగ చేస్తే చాలావరకు జబ్బుల నుంచి దూరంగా ఉండవచ్చు అని పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పి.ఇ. సి.హెచ్ శివ శంకర్, సేఫ్టీ ఆఫీసర్ యు.బ్రహ్మం, ఇ. రవి కుమార్ జి.నాగేశ్వర్ రావు, యల్.అశోక్, కే. నరసింహ రావు గుర్తింపు సంఘం నుంచి బి.బాలాజీ, ప్రాతినిధ్య సంఘం నుంచి కే.సత్యనారాయణఇతరఅధికారులు ,ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు తదితరులు పాల్గొనారు అని ఇంచార్జ్ అధికార ప్రతినిధి అశోక్ అన్నారు.

## టీఎన్జీవో ఆధ్వర్యంలో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి



**భద్రాచలం టౌన్, జూన్ 21(ప్రజాజ్యోతి):**శనివారం నీటిపారుదల శాఖ సర్కిల్ ఆఫీస్ నందు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిఎన్జీవోస్ సెక్రెటరీ గగ్గూరి బాలకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ బావ జలాన్ని నరనరాలలో ఆదిలోనే జీర్ణించుకుపోయిన వ్యక్తుల్లో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రగన్యులని, అందుకే అతన్ని తెలంగాణపిత అని తెలంగాణ ప్రజలు కీర్తిస్తున్నారని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ నాయకులు సాధిక్ భాషా మాట్లాడుతూ తొలితరం తెలంగాణ ఉద్యమకారులలొ ప్రొఫెసర్ జయశంకర్ మొదటి వరుసలో ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ప్రసాద్, మధుసూదన్ వెంకటేష్ గాంధీ లింగమూర్తి బాలకృష్ణ, వెంకట నరసయ్య, శ్రీదేవి, విజయ కుమారి,శాంత కుమారి,గంగరాజు,చంద్రలేఖ నికిత,రోహిణి ప్రమోద్ శ్రీనివాస్ వెంకటేష్ తదితరు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## ప్రగతి విద్యాలయంలో యోగా దినోత్సవం



**బూర్గంపహాడ్, జూన్ 21 (ప్రజా జ్యోతి)** :అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని సారపాక ప్రగతి విద్యాలయంలో పాఠశాల డైరెక్టర్ సానికొమ్ము చైతన్య ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. విద్యార్థులతో యోగా చేయించి యోగా వల్ల కలిగే ఆరోగ్య ఉపయోగాలను వివరించారు. యోగా ట్రైనర్ శ్రావణి, శ్రీనివాస్,శ్రేయ,లావణ్య,గణేష్,సౌజన్యలు విద్యార్థులతో యోగా సనాలు వేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోడైరెక్టర్ లక్ష్మి ప్రసన్న,ప్రధానోపాధ్యాయులు సత్య నారాయణ, ఉపాధ్యాయి నీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శివ ముత్యాలమ్మ తల్లి ఆలయ నూతన కమిటీ సమావేశం



**భద్రాచలం టౌన్,జూన్ 21(ప్రజాజ్యోతి):**భద్రాచలంలోని శివ ముత్యాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఆలయ నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఆలయ నూతన కమిటీ అధ్యక్షులుగా ఉంగరాల వెంకట్రావు ,గౌరవ అధ్యక్షులుగా బి హరిచంద్ర నాయక్ ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి గౌరవ సలహాదారులు తుమ్మలపల్లి ధనేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు శ్రీ ఉంగరాల వెంకట్రావు మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయ అభివృద్ధికి హరిచంద్ర నాయక్ కృషి చేశారని, భవిష్యత్తులో ఈ ఆలయ నిర్మాణానికి కమిటీ సభ్యులు భక్తుల సహకారంతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వేదికపై గౌరవ సలహాదారు డాక్టర్ నానుపల్లి సత్యం, ఉపాధ్యక్షులు చిట్టి నీడి రామలింగేశ్వర రావు కోశాధికారి గా బోళ్ళ వెంకట్రావు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శిగా పద్మనాభుని రవికుమార్, గౌరవ సలహాదారులుగా –కోఆర్డినేటర్ గా బండారు శరత్ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పసుపులేటి సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా పసుపులేటి వెంకట్, గౌరవ సలహాదారులుగా చిన్నాల సత్యనారాయణ వి వి సత్య నారాయణ,ఐడి ప్రభాకర్ ఉపాధ్యక్షులుగా –గంగిరెడ్డి రమణారెడ్డి , పసుపులేటి రామకృష్ణ,ఎడ్లపల్లి రామారావు ,సహాయ కార్యదర్శిగా పిరెంట్ల శ్రీకాంత్ రెడ్డి , తోట శ్రీనివాస్ , మారెడ్డి శివాజీ , రాగం నిర్మలనంద కోటగిరి ప్రమోద్ కుమార్ , ఉప కోశాధికారిగా – ఆశి ఈశ్వర్ రెడ్డి,ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా – జీనుగు నాగేంద్రరావు, పసుపులేటి శ్రీనివాసరావు, రాజ మండ్రి అచ్యుతరావు, ఉప్పులూరి సత్తిబాబు, రేపాక రాంబాబు ఎన్నికైనారు. పూజారిగా ఆర్ శ్రీరామ్ మూర్తి వ్యవహరిస్తారు.ఈ కార్యక్రమంలో మహిళా కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి



**ఇల్లందు, జూన్ 21, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి ఉమాశంకర్ కోరారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జెబిఎస్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొత్త మెనూ ప్రకారం పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. వారానికి 3 సార్లు కోడిగుడ్లు పెట్టాలని, కిచెన్ గార్డెన్ పెంచాలని, ప్రతిరోజూ వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు లలిత మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కొత్త మెనూ పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నోట్ బుక్స్, టెక్స్ బుక్స్, స్కూల్ ఏకరూప దుస్తులు విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రెటరీ కృష్ణయ్య, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## స్పెషల్ సబ్ జైలు లో యోగ శిక్షణ




**భద్రాచలం ,జూన్ 21,ప్రజాజ్యోతి :** భద్రాచలం స్పెషల్ సబ్ జైలు లో యోగ శిక్షణ తరగతులు జైళ్ళ శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా ఆదేశాల మేరకు స్పెషల్ సబ్ జైల్ భద్రాచలం నందు ముద్దాయిలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో టీచర్ మొహమ్మద్ రఫీ సూచన మేరకు వాలంటీర్ సానికొమ్ము శంకర్ రెడ్డి చే గత 12 రోజులుగా యోగా తరగతులు నిర్వహించారు .శనివారం అంతర్జాతీయయోగ దినోత్సవ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ టీచర్స్ అయిన శ్రీ శ్రీరామ్ శ్రీనివాస్, శ్రీ మహమ్మద్ రఫీ , వాలంటీర్ సానికొమ్ము శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముద్దాయిలతో యోగా దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి శ్రీ జిడుగు ఉపేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామాలయంలో ప్రసాదం విక్రయాలకు ఆన్లైన్ సేవలు



**భద్రాచలం, జూన్ 21(ప్రజాజ్యోతి ):**భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్ధం డిజిటల్ సేవల వినియోగంలో భాగంగా ఫెడరల్ బ్యాంకు దేవస్థానానికి సమర్పించిన క్రియాస్క్ మిషన్ ప్రారంభోత్సవాన్ని ఇప్పటికే ఆలయ ఈవో రమాదేవి ప్రారంభించారు. భక్తులు ఆన్లైన్ ద్వారా ప్రసాద విక్రయాలు, అర్చన తదితర వాటిని ఆన్లైన్లో శనివారం నుంచి విక్రయించుకుంటున్నారు. ఈ విధానంతో భక్తులు సులభంగా ఆన్ లైన్ ద్వారా ప్రసాదాలు పొందవచ్చని ఈవో తెలిపారు. నిముషం వ్యవధిలోనే టోకెన్ పొంది ప్రసాదం స్వీకరించవచ్చని, సమయం కూడా ఆదా అవుతుందని భక్తులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీంద్రనాథ్, ఏఈవో భవానీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో వసుధ సేవలు మరువలేనివి

- **సీఐ నాగరాజు**





**భద్రాచలం ,జూన్ 21,ప్రజాజ్యోతి :**ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు మరువలేనివి అని భద్రాచలం సిఐ నాగరాజు అన్నారు. భద్రాచలంలో వసుధ ఫౌండేషన్ ద్వారా వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి జారీ చేసిన చెక్కులను శనివారం ఆయన అందజేశారు. భద్రాచలం కు చెందిన ఎం ప్రసాద్ కు రూ 5 వేల చెక్కు తో పాటు శ్రావణి కి రూ .10000 చెక్కును సీఐ నాగరాజు వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు లు అందజే శారు. అదేవిధంగా పాల్వంచకు చెందిన ఎండి షఫీయా కు రూ.10,000 చెక్కును అందించారు. అనంతరం సీఐ నాగరాజు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన భద్రాచలం ఏజెన్సీలో వసుధ ఫౌండేషన్ విద్యా , వైద్య రంగాలకు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందినవారు తాము ఎదుర్కొంటున్న సమస్యను వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకటరామరాజు దృష్టికి తేవడంతోనే ఆయన వారి పరిస్థితి గమనించి అప్పటికప్పు డు ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. భవిష్యత్తులో సైతం వసుధ ఫౌండేషన్ ఇదే రీతిలో తమ సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

# ఆళ్ళపల్లి మండలంలో పర్యటించిన రాష్ట్రరెవెన్యూ శాఖ మంత్రి





**ఆళ్ళపల్లి. జూన్21.ప్రజాజ్యోతి** కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వెనకాడడం లేదని, ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు లేని నిరుపేద ప్రజలకు సొంత ఇంటి కలను సహకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పినపాక నియోజకవర్గం లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ఆళ్ళపల్లి మండలంలో శనివారం పర్యటించిన పొంగులేటి ముందస్తుగా మూడున్నర కోట్ల వ్యయంతో నిర్మించిన కేజీబీవీ బాలికల విద్యాలయం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ చేశారు, తదనంతరం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పక్క ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో చేయలేని పనులను ఏడాదిన్నరలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. మన ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అయిందని పేదోడి కన్నీరు తుడచాలని, పేదోడికి అండగా ఉండాలని పేదోడి చిరకాల కోరిక నెరవేర్చాలనే తపనతో మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తుంటే... అప్పుడున్న గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పటిలో నెట్టిపోతే 18 నెలల్లో మన ఇందిరమ్మ ప్రభుత్వంలో ఏవైతే ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల సంక్షేమ పథకాలను విడతల వారికి అమలు చేస్తూ ఉన్నామని వారన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకు ఇవ్వాలని ఆడబిడ్డ ఎంత దూరం బస్సులో ప్రయాణించినా చార్జి తీసుకోకుండా మన ప్రభుత్వంలో ఆడ బిడ్డలందరికీ మన ప్రభుత్వం గెలిచిన వెన వెంటనే ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామని వారున్నారు. పేదోడి పిల్లలు హాస్టల్లో చదివితే వారి పిల్లలకి మంచి సన్న బియ్యంతో భోజన సదుపాయం, 40% మెస్ చార్జీలు పెంచామని, పేదవాడికి జబ్బు చేస్తే మెరుగైన వైద్యం కోసం 10 లక్షల రూపాయల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్యక్రమం ద్వారా మంచి వైద్యం నిరుపేదలందరూ కూడా చేయించుకోవాలని, రైతన్నలు పండించిన వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ ఇచ్చిన ప్రభుత్వం మనదని, ఆనాడు 10 సంవత్సరాలు పరిపాలించిన ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసింది కేవలం 15 వేల కోట్ల రూపాయలు మాత్రమే మన ఇందిరమ్మ ప్రభుత్వం 10 సంవత్సరాలో చేసింది. పది నెలల్లో 21 వేల కోట్ల రూపాయలు రైతన్నలకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం మనదని అంతేకాదు రైతు భరోసా ద్వారా రైతుబంధు నిధులు రైతన్నలకు అకౌంట్లో జమ చేశామని, గత ప్రభుత్వం పది సంవత్సరాలు పరిపాలించి ఏ పేదవాడికేనా కెసిఆర్, కేటీఆర్ అప్పుడు ఉన్న మంత్రులు టీవీలలో బొమ్మలు చూపించి ఇది ఒక్కసారి మాకు ఓటేయండి ఇటువంటి బొమ్మ ఇల్లు ఇస్తామని మాయ మాటలు చెప్పి రెండుసార్లు గెలిచి ముఖ్యమంత్రి అయిన పేదోడి కల కలలాగా మిగిలిపోయిందని బిఆర్ఎస్ ప్రభుత్వంపై ఎద్దేవా చేశారు. మన ఇందిరమ్మ రాజ్యంలో తమ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలందరికీ విడతలవారీగా ఇండ్లను మంజూరు చేసి గుడిసె లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఇప్పటికే రాయపాడు గ్రామపంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి నిర్మాణాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే మండలంలోని 12 గ్రామ పంచాయతీలలో 159 మందికి ఇందిరమ్మ పక్క ఇండ్లు పత్రాలు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఇండ్లు వచ్చిన వారందరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లను త్వరతగతిన పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. నిర్మాణాలు ఎంత త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరు కూడా అదే విధంగా లబ్ధిదారుని ఖాతాలో అమౌంట్ జమ అవుతాయని మంత్రి అన్నారు. ఇండ్లు మంజూరు కానీ నిరుపేదలు ఎవరైనా ఉంటే నిరాశకు గురి కావద్దని మరో మారు వచ్చే విడతలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు.ఆళ్ళపల్లి మండల కేంద్రం నుంచి 36 కిలోమీటర్లు అనిశెట్టిపల్లి వరకు డబల్ రోడ్, రేగళ్ల టు మర్కోడు వయా మామకన్ను రహదారికి 38 కోట్లు నిధులు, మండల కేంద్రం నుంచి పెద్ద వెంకటాపురం బీటీ రోడ్డుకి ఫారెస్ట్ అనుమతులు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి రాయిగూడెం గ్రామానికి వంతెన నిర్మాణంకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి మండల ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదివాసి గిరిజన విద్యార్థులందరూ ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించడానికి వందమంది ఉండేలా చూసి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేస్తామని అన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్నా ఆదివాసి గిరిజనుల భూములకై ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులు పెట్టొద్దని వాటి సమస్యలు వెంటనే కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటిడిఏ పిఓ రాహుల్, మహబూబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, తుళ్లూరి బ్రహ్మయ్య, అయోధ్య, జిల్లా జడ్పీ సీఈవో నాగజ్యోతి, డిఆర్డిఏ రవి, ఇల్లందు డిఎస్పి చంద్రబాను, టేకులపల్లి సిఐ సురేష్, స్థానిక ఎస్సై సోమేశ్వర్ ఆధ్వర్యంలో శాంతి భద్రత భారీ బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏవో అనిల్ కుమార్, వైద్యాధికారి సంఘమిత్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామ నరసయ్య, పడిగ సమ్మయ్య, కో ప్రచార కమిటీ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, శ్రీనాథ్, పెండకట్ల పాపారావు,కాంతు, భరత్,రాము మండల అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నివాస గృహాలను క్రమబద్ధీకరించాలి





**ఇల్లందు, జూన్ 21, ప్రజాజ్యోతి :**ఇల్లందు మున్సిపల్ పరిధిలో నివాస గృహాలను క్రమబద్ధీకరించాలని శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సింగరేణి గెస్ట్ హౌస్ లో ఇల్లందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం, దేవతల ప్రతిమలు, వినతిపత్రం అందజేశారు. 2017లో జిఓ యంఎస్ నెంబర్ 224కు అనుసంధానంగా 2005లో జారీ చేసిన జిఓ యంఎస్ నెంబర్ 373 ఉత్తర్వులను అమలు చేసి పట్టణ ప్రజల నివాస గృహాలను క్రమబద్ధీకరించాలని కోరారు. బొగ్గు గనుల త్రవ్వకాల ప్రారంభంలో ఇల్లందులో ఏర్పాటు చేసుకున్న నివాస గృహాలు క్రమబద్ధీకరణకు నోచుకోక ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య ద్వారా అప్పటి మున్సిపల్ పాలకవర్గం నివాస గృహాలకు క్రమబద్ధీకరణ కోసం అప్పటి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాలలో నివాస గృహాల క్రమబద్ధీకరణ కోసం 2005 లో జిఓ యంఎస్ నెంబర్ 373తో ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ జిఓలో ఇల్లందు పట్టణంలోని నివాస గృహాల క్రమబద్ధీకరణ అంశాన్ని విస్మరించడం జరిగిందన్నారు. అనంతరం 2017లో జిఓ యంఎస్ నెంబర్ 224తో అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో తమ పాలకవర్గం ప్రభుత్వానికి వివరించడం వల్ల సుమారుగా 8 వేలకు పైగా నివాస, కమర్షియల్ గృహాలు రెగ్యులేషన్ కోసం అనుమతించడం జరిగిందన్నారు. కొందరు దరఖాస్తులు చేసుకోగా, మరికొందరికి సమాచారం లోపంతో దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. 2020లో ధరణి, చెరువుల పూడికతీత పనుల వల్ల సర్వేయర్లపై పని భారం పెరగడంతో సర్వేలు నిలిచిపోయి నేటికీ పట్టాలు జారీ చేయలేదని వివరించారు. ఇల్లందు పట్టణంలోని నెలకొన్న గృహాల క్రమబద్ధీకరణ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పట్టాలు వచ్చేలా చొరవ చూపాలని కోరారు. పై సమస్యలను విన్న మంత్రి సనుకులంగా స్పందించి ఇల్లందు పట్టణంలో నివాస గృహాల క్రమబద్ధీకరణ కోసం తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ తెలిపారు.

# నాలుగు లీటర్ల నాటు సారా పట్టివేత

- వ్యక్తిపై కేసు నమోదు చేసి బైక్ సీజ్



**కొత్తగూడెం,జూన్21, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామవరం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా హోండా షైన్ బైక్ పై బానోత్ మున్ని అనే వ్యక్తి వద్ద రెండు ప్లాస్టిక్ బాటిళ్లలో 4లీటర్ల సారా లభ్యమైనట్టు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్ ఐ గౌతమ్ తెలిపారు. పట్టుకున్న నాటు సారాను,బానోత్ మున్నిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ గౌతమ్ తెలిపారు.ఈ తనిఖీల్లో డిటిఎఫ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్,హబీబ్,గురవయ్య, సుమంత్,రమేష్,పార్థసారథి పాల్గొన్నారు.

# యోగ సందర్భంగా కోయగూడెం ఓ. సి హరితోత్సవం



**టేకులపల్లి,జూన్21,ప్రజాజ్యోతి :** ఇల్లందు ఏరియా కోయగూడెం ఓ.సి లో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా హరితోత్సవం కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గని మేనేజర్ శ్రీనివాసరావు హాజరై,వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు కాలుష్యం అధికమవుతుందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణహిత రాష్ట్రంగా ఉండడానికి పాటుపడాలని సింగరేణి వ్యాప్తంగా ప్రతి ఏటా కోట్ల మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడంలో ఎంతో కృషి చేస్తుందని మొక్కలు మానవాళి మనుగడకు దోహదపడతాయని సింగరేణి సంస్థ కోయగూడెం ఓ సి లో మొక్కలు నాటి తమ వంతు పర్యావరణాన్ని కాపాడడంలో ఎప్పుడు ముందు ఉందని కావున ఉద్యోగులు తమ పరిధిలోని ఖాళీ స్థలాలలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని తెలిపారు. తదుపరి వారు మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో పి శివ శంకర్,సేఫ్టీ ఆఫీసర్ యూబ్రహ్మం, అడిషనల్ మేనేజర్ రవికుమార్,నాగ శేషు, అశోక్, కే నరసింహరావు ,ఏజియం (ఐఇ) గిరిధర్ రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మోహన్, ఏరియా ఇంజనీరింగ్ నరసింహారాజు, ప్రాతినిధ్య సంఘం నుండి కే సత్య నారాయణ,గుర్తింపు సంఘం బి.బాలాజీ, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# యోగా చేయండి ఆరోగ్యంగా వుండండి

- మండల విద్యాశాఖాధికారి ఆనంద్



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 21, ప్రజా జ్యోతి:**అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్,సమగ్ర శిక్ష హైదరాబాద్ ఆదేశాల మేరకు, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో ఉదయం 6-30 నుండి 7-30 వరకు నిర్వహించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లకావత్ జయరాం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శారీరక ఆరోగ్యానికి యోగా ఉపయోగ పడుతుందని, అందరూ ప్రతి రోజు యోగా చేయాలని మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునంద రెడ్డి, శాంత కుమారి, బాబూరావు, వెంకటేశ్వర రావు, వసంత, సుశీల, పద్మ, మోతీలాల్, పాఠశాల సిబ్బంది శ్రీనివాస్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

# బూర్గంపహాడ్ తహశీల్దార్ కార్యాలయంలో 'అవినీతి జలగ

- లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ టైపిస్ట్

**బూర్గంపహాడ్, జూన్ 21 (ప్రజా జ్యోతి ):**బూర్గంపహాడ్ తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి జలగ బయటపడింది. ఏసీబీ వచ్చిన ఫిర్యాదుతో మెరుపుదాడి చేయడంతో టైపిస్ట్ రూ.2500 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్గా పట్టుబడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది.



ప్రభుత్వం ఇటీవల రేషన్కార్డుల ప్రక్రియ చేపట్టడంతో రెవెన్యూ కార్యాలయంలో రేషన్కార్డులు ప్రాసెస్ చేసి అప్లోడ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మండలానికి చెందిన ఓ వ్యక్తి రేషన్కార్డుకు సంబంధించి అప్లోడ్



ప్రాసెస్ చేయాలని చెప్పడంతో రెవెన్యూ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్(టైపిస్ట్)గా పనిచేస్తున్న సీహెచ్. నవక్రాంత్ అతని వద్ద రూ.4వేలు లంచం డిమాండ్ చేశాడు. మండలానికి చెందిన సదరు వ్యక్తి ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రూ.2500 లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ తన బృందంతో మెరుపుదాడి చేసి టైపిస్టు రెడ్యండెడ్గా పట్టుకున్నారు..

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణతులసి పూజలు



**భద్రాచలం కల్చరల్ , జూన్ 21,ప్రజాజ్యోతి :**భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అర్చకులు శనివారం స్వర్ణతులసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం రామయ్యకు పట్టాభిషేక కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో ఘనంగా యోగా డే



**భద్రాచలం టౌన్, జూన్ 21(ప్రజాజ్యోతి ):**పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారి వెంకటేశ్వరరావు హాజరై యోగా చేయడం వల్ల చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆరోగ్యపరంగా, మానసిక ప్రశాంతత కలుగుతుందని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. అనంతరం యోగా ఇన్స్ట్రక్టర్స్ ద్వారా యోగసనాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కైలాష్ మోహన్, సంతోష్, జగదీష్, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీలకు సీపీఎం అండగా ఉంటుంది

- ఇరవెండి కొర్సగుంపును సందర్శించిన సీపీఎం నేతలు



**బూర్గంపహాడ్, జూన్ 21,(ప్రజా జ్యోతి ):**గిరిజన ఆదివాసీలకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందని, ఫారెస్టు అధికారులు పోడుదారులపై చేసిన దాడిని ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదరిశ మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం దాడిజరిగిన గ్రామాన్ని సీపీఎం నేతలతో కలిసి సందర్శించారు. కందకాలు తవ్వడానికి వెళ్లిన పోడు భూముల ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. వలస ఆదివాసీలపై ఫారెస్టు అధికారుల దాడి సరైంది కాదని, 25 ఏళ్లుగా స్థానికంగా జీవనం సాగిస్తూ పోడు సాగు చేస్తూ జీవిస్తున్నారని అలాంటి వారిపై దాడులు సరైంది కాదని విమర్శించారు. ఫారెస్టు అధికారులు ఏకపక్షంగా సాగులో ఉన్న భూములను ఆక్రమించడం కోసం బుల్డోజర్ తీసుకువెళ్లడం, ఈ సంఘటనలో మహిళా గిరిజనులపై వారు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆదివాసీలపై పెట్టిన కేసులు వెనక్కు తీసుకోవాలని, గిరిజనులకు అటవీహక్కుల చట్టం ప్రకారం పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. తెల్లం కోస, తాటి పాండే, కుండా రమేష్, తాటి ఉంగ, మడకం సునీత, మడకం నందిని, లక్ష్మి, తాటి లక్ష్మిలు పాల్గొన్నారు.

## ఇరవెండి పోడుదారులపై ఫారెస్టు దాడులు, దౌర్జన్యాలు ఆపాలి

- దాడిని ఖండించిన తెలంగాణ రైతుకూలీ సంఘం



**బూర్గంపహాడ్, జూన్ 21 (ప్రజా జ్యోతి ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివాసీ పోడుదారులపై ఫారెస్టు అధికారులు దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ దాడులను అరికట్టాలని, మండల పరిధిలోని ఇరవెండి పోడుదారులపై ఫారెస్టు దాడులు, దౌర్జన్యాలను తెలంగాణ రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి పున్నంచంద్ ఖండించారు. శనివారం బూర్గంపహాడ్లో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన రైతుకూలీలతో మాట్లాడారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆదివాసీల సాగులో ఉన్న చివరి ఎకరా పోడు భూములకు పట్టాలిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకముందే ఫారెస్టు అధికారుల అత్యుత్సాహం ఏజెన్సీలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తున్నాయని, వెంటనే ఫారెస్టు అధికారుల దాడులను అదుపుచేసి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఫారెస్టు అధికారుల దాడులను వెంటనే అరికట్టాలని, పోడుదారులకు న్యాయం చేయాలని, ఇరవెండిలో పోడుదారులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తోలెం మమత, జిల్లా అధ్యక్షురాలు కుంజా సోమక్క, సహాయ కార్యదర్శి సోంది గోపమ్మ, తెలంగాణ రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం నర్సింహారావు, జిల్లా నాయకులు సోడె రామకృష్ణ, పూజిత, శాంతికుమారి పాల్గొన్నారు.

## వత్తిడి భరించలేక ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



**భద్రాచలం, జూన్ 21,ప్రజాజ్యోతి :**చిట్ ఫండ్ కంపెనీ ఎత్తివేయడంతో కలెక్షన్ ఏజెంట్ గా ఉన్న తనను డబ్బులు కట్టిన వారు వేధింపులకు గురిచేస్తుండటంతో వత్తిడి భరించలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం భద్రాచలంలోని రిక్షాకాలనీలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రిక్షాకాలనీకి చెందిన గొరసా శ్రీనివాస్(36) పట్టణంలోని ఓ ప్రయివేటు చిట్ ఫండ్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఈ కంపెనీ గత కొన్ని నెలల క్రితం ఎత్తేయడంతో కలెక్షన్ ఏజెంట్ గా ఉన్న శ్రీనివాస్ నన్ను డబ్బులు కట్టిన ఖాతాదారులు పదే పదే మాకు తిరిగి డబ్బులు చెల్లించాలని, నీదే ఆ బాధ్యత అంటూ వత్తిడికి గురిచేయడంతో ఓ లేఖను రాసి శనివారం ఇంట్లో ఎవరూ లేనిసమక్షంలో శ్రీనివాస్ ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం వద్ద ఉన్న లేఖను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి

**ఇల్లందు, జూన్ 21, ప్రజాజ్యోతి:** తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జగదాంబ సెంటర్ లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ పార్టీ ఫౌండర్ మెంబర్ దిండిగాల రాజేందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివన్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటి తెలంగాణ ప్రజలను జాగృత పరిచి రాష్ట్ర సాధన కోసం జయ శంకర్ జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, అజ్మీరా భావు సింగ్ నాయక్, అబ్దుల్ నబీ, మహమ్మద్ అబ్దుల్ జబ్బార్, గిన్నారపు రాజేష్, సాతల హరికృష్ణ, కాసాని హరి ప్రసాద్ యాదవ్, సన రాజేష్, చాంద్ పాషా, మునిగంటి శివ, దేరంగుల పోశం, రామ్ లాల్ పాసి, లలిత్ కుమార్ పాసి, ఘాజీ, కిషన్ పాసి, గౌస్, వార రమేష్, పరికపెల్లి రవి, దుంపటి కృష్ణయ్య, సత్యనారాయణ, ఈర్ల శ్రీకాంత్, ఈదుల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

